# విలువైన మనసు

గుమ్మంలో నిలబడ్డ నిఖిల మస్తిష్కంలో ఆలోచనలు - సందేహాలూ సముద్రపు కెరటాల్లా దొర్లసాగాయి. "నిజమే! ఇప్పుడు ఈ పెళ్ళికి వెళ్ళి రావాలంటే మాటలా? ఎంతలేదన్నా రెండు, మూడు వందలన్నా లేకపోతే వెళ్ళిరావడం కుదరదు. రానూ, పోనూ రైలుటిక్కట్టే వంద రూపాయలు. మిగిలిన చిల్లర ఖర్చులు వంద అనుకుందాం - మరి ప్రాణస్నేహితురాలి పెళ్ళికెళ్తూ వట్టిచేతుల్తో ఎలా వెళ్ళడం! అదో వందన్నా వేసుకోవాలి. అయినా ఈ రోజుల్లో వంద రూపాయలకి ఏం వస్తుంది? కానీ తమకి వంద రూపాయలంటే మాటలా? తమవంటివారికి వందపైసలకి కూడా ఎంతో విలువుంది. మరి జయంతి గొప్పింటి బిడ్డ. పైగా ఇంజనీరు భార్య కాబోతోంది. అటువంటప్పుడు మనం మన పరిస్థితుల్నిబట్టి బహుమానం ఇస్తామా? లేక జయంతి తాహతుని బట్టా!! వట్టిచేతుల్తో పెళ్ళికెళ్ళం కదా? అలాగని పదో, పాతికో బెట్టి జయంతిలాంటి దానికి ఏం తీసుకెళ్తాను?

ఎలా తీసుకెళ్తాను! పైగా జయంతి, తను చిన్ననాటి స్నేహితులే కాదు, ప్రాణస్నేహితులు కూడాను!

తమ స్నేహాన్ని చూసి ఎందరో ఓర్వలేక అసూయపడేవారు. తమ మధ్య మనస్పర్థలు కలిగించాలని కొందరు ప్రయత్నించి విఫలులయ్యారు. చెక్కుచెదరని తమ స్నేహం. సొంత అక్క చెల్లెళ్ళ అనుబంధం కన్నా మిన్నగా వుండేది. తన పెళ్ళయినప్పుడు "ఇంక యింతటితో మా స్నేహితురాళ్ళు ఒకరికొకరు దూరమవుతారు పాపం!" అని సానుభూతిగా కొందరు, వెటకారంగా కొందరు అంటోంటే నిజంగానే దుఃఖం పొంగుకొచ్చి ఇద్దరూ ఏడ్చారు. తను అత్తవారింటికి వచ్చేస్తుంటే జయంతి బాధ వర్ణనాతీతం. తల్లి తన దుఃఖాన్ని దిగమింగుకుని జయంతిని వూరడించింది. ఆ తరువాత కూడా తరుచూ ఉత్తరాల ద్వారా ఎన్నో కబుర్లు చెప్పుకునేవారు.

గిర్రున ఏడాది తిరిగిపోయింది. ఆర్థికఇబ్బందులవల్ల మళ్ళీ తను పెళ్ళయ్యాక పుట్టింటికి వెళ్ళలేదు. అటు వాళ్ళకి తీసుకెళ్ళే స్తోమతు లేదు. ఇటు భర్తకు పంపే తాహతు లేదు.

కానీ ఈ రోజు మాత్రం తన కవేం పట్టడం లేదు. ఎలాగయినా సరే జయంతి పెళ్ళికెళ్ళి తీరాలి అని నిశ్చయించుకుంది. తాహతుల తారతమ్యం తమ మధ్యలేదని నిరూపించుకున్న



కందుకూరి వెంకట మహాలక్ష్మి

నిర్మలమైన స్నేహం జయంతిది, లేనింటి పిల్లనని తననెప్పుడూ కించపరచనిది జయంతి స్నేహం.

శ్రీకాంత్ రాకతో నిఖిల ఆలోచనలకి ఆనకట్ట పడింది. ఇంతసేపూ మనస్సులో దాచుకున్న ఆనందమంతా శ్రీకాంత్ రాకతో పెల్లుబికి ఆనకట్ట తెగిన నదిలా పొంగి పొర్లసాగింది.

"ఏమిటోయ్! అంత ఆనందంగా వున్నావు!" అంటూ భార్య బుగ్గమీద చిటిక వేశాడు శ్రీకాంత్.

భర్తతో లోపలికి నడుస్తూ జయంతి పెళ్ళి గురించి చెప్పుకుంటూ వెంట, వెంట తిరగసాగింది నిఖిల. ఊకొడుతూనే బట్టలు మార్చుకుని, ముఖం కడుక్కుని, నిఖిల ఇచ్చిన కాఫీ అందుకున్నాడు శ్రీకాంత్.

"ఏమండీ! నెలాఖర్నే పెళ్ళండి - నేను ఎల్లుండి బయలుదేరి వెళ్తాను. ఓ పదిరోజులు మా అమ్మావాళ్ళ దగ్గర వున్నట్లు వుంటుంది. మా జయంతి పెళ్ళికి కాస్త సహాయపడ్డట్టా వుంటుంది! వెళ్ళనా?" అంది గోముగా బ్రతిమాలుతూ.

మౌనంగా నిఖిల ముఖంలోకి చూసిన చూపులకి నిఖిల నీరుకారిపోయింది ఒక్కసారిగా టెంపరేచర్ దిగిపోయిన పేషంటులా నీరసపడిపోయింది. అంతదాకా వున్న ఉత్సాహం చప్పబడిపోయి, వుక్కురోషంగా శ్రీకాంత్‌వైపు చూసింది. ఆ చూపుల్ని అర్థం చేసుకున్న శ్రీకాంత్ నిఖిల చెయ్యి పుచ్చుకుని పక్కని కూర్చోపెట్టుకున్నాడు.

"నిఖిలా! మనింటి పరిస్థితులు నీకు తెలియనివి కావు. అన్నీపోను చేతికొచ్చేది ఆరొందలు. అందునా ఇది నెలాఖరు. ప్రయాణమంటే కనీసం రెండొందలయినా కావాలి కదా? ఇంట్లో ఎంత మిగిలిందో నీకు మాత్రం తెలీదా?" అన్న మాటలకి చిన్నబుచ్చుకుని అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయింది.

మర్నాడు శ్రీకాంత్ ఆఫీసు నుంచి వస్తూనే నిఖిల చేతిలో హైదరాబాద్‌కి టిక్కెట్టు ఓ వంద రూపాయలు పెట్టి "కష్టం మీద ఈ మాత్రం అప్పు సంపాదించగలిగానోయ్? వీటితో ఎలాగో మేనేజ్ చేసి తిరిగొచ్చెయ్?" అన్న మాటలకి ఆశ్చర్యం, ఆనందం పట్టలేక భర్తని పెనవేసుకుపోయింది.

మర్నాడే ప్రయాణమన్న ఉత్సాహంతో అన్ని పన్లు చకచకా చేసుకుని ప్రయాణానికి సిద్ధమవసాగింది. భర్త ఇచ్చిన టిక్కెట్టు, డబ్బు పర్సులో పెట్టుకుంది. అకస్మాత్తుగా ఏదో గుర్తొచ్చి అచేతనంగా నిలబడిపోయిన నిఖిలని చూసి "అలా నిలబడిపోయావేం? ఏమన్నా కావాలా?" అన్న శ్రీకాంత్ మాటలకి తేరుకుని "అబ్బే! ఏంలేదు" - అంటూ ఆ గదిలోంచి వెళ్ళిపోయింది - తన తొట్రుపాటు అతనికి కనబర్చడం ఇష్టంలేనట్టు.

"పెళ్ళికెళ్తున్నాను భర్త వెళ్ళమన్నారు అన్న సంతోషంలో జయంతికి ప్రెజెంటేషన్ కొనాలన్న సంగతే మర్చిపోయాను. ఇప్పుడు ఆ విషయం ఎలా చెప్పడం. పాపం అప్పుచేసి తన సరదా తీరుస్తున్నదే కాకుండా ఇంకా ప్రెజెంటేషన్‌కి డబ్బు కావాలని ఎలా అడగడం?" అనుకొని పైకి ఏమీ అనకుండా త్వరత్వరగా పన్లు ముగించుకుంటోన్న నిఖిల మదిలో మాత్రం "జయంతి పెళ్ళికి వట్టిచేతుల్తో ఎలా వెళ్ళడం!" అన్న సమస్య వేధించసాగింది. "పెళ్ళికొచ్చిన ప్రతీవాళ్ళూ వధూవరులకి ఏదో ఇస్తారు" తన స్నేహితులంతా కూడా వస్తారు. "ఏం తెచ్చావు నీ స్నేహితురాలి"కని అడుగుతారు. అప్పుచేసుకొచ్చాను. ఖర్చులకే బోల్డు డబ్బయిందని, ఏం తేలేదని అంటే వెటకారమాడతారే తప్ప అర్థం చేసుకుని సానుభూతి చూపించరు," అని ఆలోచించసాగింది.

ఇంతలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఇంతసేపూ మనసులో వున్న ఆవేదనని ఓ మూలకి నెట్టి మర్నాడు వుల్లాసంగా రైలెక్కింది.

జయంతి పెళ్ళి అనుకున్న దానికంటే ఘనంగా జరుగుతోంది. ఇటూ, అటూ కోటికి పడగెత్తిన వారవడంతో ఒకరికొకరు పోటీపడుతున్నట్లు ముద్దుముచ్చట్లు జరుపుతున్నారు. పెళ్ళి పందిరంతా తనే అయినట్లు, అంతా తనదే బాధ్యతయినట్లు తిరిగేస్తోంది నిఖిల. జయంతి తల్లితండ్రులు కూడా ప్రతీదానికి "నిఖిలా! నిఖిలా!" అంటూ నిఖిలనే పిలవడం జయంతి అత్తవారికి నిఖిల జయంతికి పిన్నికూతురో పెద్దమ్మ కూతురో అయి వుంటుందనుకున్నారు.

నిఖిల, జయంతి ఆ వూళ్ళోనే చదువుకోవడం వల్ల వారి స్నేహితులంతా పెళ్ళికి వచ్చారు. జయంతి పెళ్ళికి నిఖిల రావడమే కాకుండా పెళ్ళి పెత్తనమంతా ఆమె చేతి మీద జరగడం ఆశ్చర్యంగానూ, అసూయగానూ వుంది వారిలో కొందరికి.

ముహూర్తమవగానే కానుకల చదివింపులు ప్రారంభమయ్యాయి. బంధువులంతా అయ్యాక, స్నేహితులంతా చందా వేసుకుని కొని తెచ్చిన టేబిల్‌ఫేన్ జయంతికి చదివించారు. అందులో కొందరు అక్కడే నిలుచున్న నిఖిలని ఉద్దేశించి "నువ్వేం తెచ్చావు నీ ఫ్రెండ్‌కి?" అన్నారు. "చిన్నకానుక?" అంది ఏ భావమూ వ్యక్తపర్చకుండా.

"అంటే?? బెనారస్ చీరా? కంచి చీరా? నగా?" అన్నారు అందులో ఒకళ్ళు. నిఖిల వళ్ళు భగ్గున మండింది. అయినా లేని ఓర్మి తెచ్చుకుని వూరుకుంది.

"ఏ టేప్‌రికార్డరో, ట్రాన్సిస్టరో తెస్తావేమో అని ఊరుకున్నాం – అసలు ఈ ఫేన్‌కి నీ దగ్గరా ఓ ఇరవై రూపాయలు తీసుకుని నీ పేరూ ఈ లిస్టులో రాసేద్దాం – నీకూ స్వల్పంతో వదిలిపోతుంది అని అనుకున్నాం" అంది మరో స్నేహితురాలు వెటకారంగా నవ్వుతూ.

అందర్లో తనని అలా చులకన చేస్తూ మాట్లాడుతున్న వారిని ఓసారి చూసి బాధగా తలదించుకుని లోనికెళ్ళింది నిఖిల.

స్నేహితురాలి పెళ్ళికి నిఖిల బహుమానం చీర రవికల గుడ్డ - అంటూ పురోహితుడు చక్కటి ఉల్లిపొర కాగితంలో చుట్టిన అట్టపెట్టెని జయంతి చేతిలో పెట్టడంతో స్నేహితురాళ్ళందరి ముఖాలు కళావిహీనమయ్యాయి.

తిరుగు ప్రయాణం రోజు ఇట్టే వచ్చేసింది. నిఖిలకి జయంతి ఇంటికెళ్ళి వీడ్కోలు తీసుకుని రావాలని బయలుదేరింది. మూడు నిద్రలలో వచ్చిన జయంతి కూడా త్వరలోనే భర్త దగ్గరకి వెళ్ళిపోతోంది. నిఖిలని చూస్తూనే సంతోషంతో ఎదురొచ్చి లోపలికి తీసుకెళ్ళింది. "మళ్ళీ ఎప్పటికి కలుస్తామో!" అన్న బాధతో ఇద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. భోజనానంతరం "ఇక వెళ్తా"నని బయలుదేరిన నిఖిలతో "రాత్రి రైలుకొస్తానే నిఖీ!" అని సాగనంపింది జయంతి.

రైలు దగ్గర కళ్ళనీళ్ళతో ఒకళ్ళనొకళ్లు వీడ్కోలిచ్చుకున్నారు. పచ్చలైటు వెలిగింది. గార్డు పచ్చజెండా వూపసాగాడు. రైలు కూతవేసి బయలుదేరింది. జయంతి బేగ్‌లోంచి ఓ పేకట్ తీసి నిఖిల చేతిలో వుంచుతూ "సారీ నిఖిలా! ఇందాక వచ్చినప్పుడు ఇవ్వలేకపోయాను. సాయంత్రమే బజారుకెళ్ళి తెచ్చాను. ఈ చీర, రవికలగుడ్డ అమ్మ నీకిమ్మనమంది" అంటూ బయలుదేరిన రైలుతో నడుస్తూ వెళ్ళి యిచ్చింది. రైలు వేగం పుంజుకోగానే నిఖిల కనిపించినంత దూరం చెయ్యివూపుతూ నిలబడ్డ జయంతిని అశ్రునయనాలతో చూస్తూ కూర్చుండిపోయింది తియ్యటి జ్ఞాపకాలని నెమరేసుకుంటూ.

పక్క స్టేషన్‌లో రైలు ఆగిన కుదుపుకి ఈ లోకంలోకి వచ్చిన నిఖిల దృష్టి వళ్ళో వున్న పేకట్ మీదకి మళ్ళింది. నెమ్మదిగా పై కాగితాన్ని చింపి లోపలి చీరని బైటికితీసి వెర్రిదానిలా ఆ చీరనే చూస్తూ వుండిపోయింది. ఆ చీర మడతలో వున్న ఉత్తరాన్ని తీసి చదవసాగింది.

"ఏమే పిచ్చి నిఖీ! ఎంత వెర్రిదానవే! ఈ చీర తెచ్చి నాకు ప్రెజెంటేషన్ చెయ్యకపోతే నాకు నీయందున్న ప్రేమ తరిగిపోతుందా? అయినా ప్రెజెంట్ కోసం నిన్ను పిల్చానా! ఎంతో అభిమానంగా నువ్వు అంతదూరం నుంచి ఎంతో ఖర్చు చేసుకుని నా పెళ్ళికొచ్చావు. అదే నాకు పెద్దకానుకే! ఎవరో ఏదో అనుకుంటారని ప్రెజెంటేషన్ తెస్తారా? వూళ్ళోవాళ్ళ కోసం ఈ చీర నాకిస్తావా? కానుకలిచ్చిన వాళ్ళంతా ఆత్మీయులు, ఇవ్వనివారు ఏమీ కారు అనుకునే అంత అవివేకిని కాను. పెళ్ళిపందిట్లో పిచ్చిపిచ్చిగా మాట్లాడి, నిన్ను అవమానపరిచిన వారి సంస్కారం ఎలాంటిదో మనకి తెలియనిది కాదు. వారి కోసం నువ్వు తెచ్చిన ఈ ప్రెజెంట్‌ని నీకే తిరిగి ఇచ్చేస్తున్నందుకు బాధపడి నన్ను అపార్థం చేసుకోకు. ఎందుకు తిరిగి నీకే ఇచ్చేస్తున్నానో తెల్సా? ఈ చీరంటె నీకెంత ఇష్టమో నాకు తెల్సు కనక!" "మావారు నాకోసం కొన్న తొలి చీర" అని "అదే కట్టుకుని శ్రీవారి చెంత వెళ్ళా"లని నువ్వు అత్తవారింటికెళ్ళే రోజు ఇదే చీర కట్టుకుని వెళ్ళేవు. బహుశా ఆ విషయం నువ్వు మర్చిపోయావనుకుంటాను. గుర్తుండి వుంటే అదే నైలెక్సు చీర జాగ్రత్తగా పేక్‌చేసి నాకు ఇచ్చి వుండేదానివి కాదు. మీవారు నీకిచ్చిన తొలి కానుకని (ఎంత ప్రాణమిత్రురాలినైనా) నాకు ఇవ్వడంలో నీ స్నేహం ఎంత గొప్పదో ఎంత విలువ కట్టలేనిదో

తెలుసుకోగలను. కానీ నాకు అది తీసుకోవడానికి మనస్కరించడం లేదు. కారణం - తొలికానుక తొలికానుకేను. అందులో ప్రియుని తొలికానుక విలువ కట్టలేని కానుక. ఆ చీర ఇంకా ఎన్నోమార్లు కట్టుకుని మీ వారిని కవ్విస్తూ తిరిగి, ఆయన పొగడ్తలతో మురిసిపోవాలనే భావంతోటే నీకిది తిరిగి ఇచ్చేస్తున్నాను. అంతకంటే మరో ఉద్దేశ్యంతో నీకు ఇవ్వటం లేదు. అపార్థం చేసుకోవని తెల్సు. సరే...ఇంక ఆ విషయం వదిలేద్దాం. ఆ చీర అడుగున అమ్మ నీ కోసం ఇచ్చిన ఐదువందలు పెట్టేను నీకు నచ్చిన చీర కొనుక్కోమని మరీ మరీ చెప్పమంది. అమ్మ ఆశీర్వదిస్తూ ఇచ్చినది వద్దనవు కదూ!

ప్రేమతో

నీ జయంతి"

ఆ వుత్తరం మడిచి పెట్టె అడుగున పెట్టిన నిఖిలకి వందరూపాయల నోట్లు కనబడ్డాయి. నిఖిల మనస్సు బరువెక్కిపోయింది.

"ఎంత సున్నితంగా బుద్ధి చెప్పింది! జయంతి హోదాలోనే కాకుండా, స్వభావంలో కూడా చాలా గొప్పది! తన తెలివితక్కువపనిని నలుగుర్లో నిందించలేదు. తనిచ్చిన పాత చీరని పదిమందిలో తిప్పికొట్టకుండా ఎంత నేర్పుగా, మంచిగా, చాటుగా రెండో కంటికి తెలియకుండా తనది తనకప్పగించింది. అంతేకాదు - తనకీ డబ్బివ్వడంలో ఎంత గ్రహింపు వుంది! ఓ కంచిపట్టు చీర కొని నలుగుర్లో గొప్పగా తనకి పెట్టకుండా, నా అవసరాన్ని, పరిస్థితుల్ని గ్రహించి ఈ డబ్బు ఇచ్చిందా?

నలుగుర్లో తన గొప్పతనాన్ని చూపించుకోకుండా, నన్ను కించపరచకుండా, అవమానపర్చకుండా ఎంత నేర్పుగా, సున్నితంగా తనకి నీతిని బోధించింది! ఛీ - ఇన్నాళ్ళ స్నేహంలో కూడా జయంతి ఔదార్యాన్ని గ్రహించలేకపోయిన మూర్ఖురాలిని. ఎంత తెలివితక్కువ పని చేశాను!" అనుకుని తనలోతనే బాధపడసాగింది నిఖిల.

"నిజమే మంచి మాటలాడిన మనిషి సంస్కారం ఎదుటివారికి తెలియడమే కాకుండా, ఆ మాటలు ఎదుటి వ్యక్తిలోని మాలిన్యాన్ని పారద్రోలి, మార్పుని తెస్తాయి" అనుకుంది తేలికైన మనస్సుతో.

- వనితాజ్యోతి, మార్చి 1985